క్లుప్తంగా

గ్రామ సభల్లో 735 అర్జీల స్వీకరణ



మాట్లాడుతున్న తహసీల్దారు రమాదేవి

మాడుగుల రూరల్: మండలంలో సుమారు 33 రోజుల పాటు నిర్వహించిన రీసర్వే రెవెన్యూ గ్రామ సభల్లో 735 అర్జీలను రైతుల నుంచి స్వీకరించినట్టు స్థానిక తహసీల్దారు కె.రమాదేవి శుక్రవారం సాక్షికి తెలిపారు. వీటిలో భూముల విస్తీర్ణంలో తప్పులను సరిచేయాలని, ఉమ్మడి భూములను వేరు చేయాలని కోరుతూ 347 అర్జీలు, పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు సరిచేయాలని 338 అర్జీలు వచ్చినట్టు చెప్పారు. ఈ దరఖాస్తులను 9 కేటగిరీలుగా విభజించినట్టు చెప్పారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

దుర్గాలమ్మకు ఘనంగా పూజలు

మాడుగుల రూరల్: మండలంలో కేజే పురంలో దుర్గాలమ్మాలకు శుక్రవారం పసుపు కుంకమలతో ఘనంగా పూజలు నిర్వహించారు. సారె ఊరేగింపు అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నసమారాధన జరిపారు. వంటర్లపాలెం, అప్పలరాజుపురం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం: నియోజకవర్గ కేంద్రం నర్సీపట్నంలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, జి.కోటేశ్వరరావు కోరారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సీపట్నంలో మొదటసారిగా డిసెంబర్ 20 నుంచి 22 వరకు జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై భవిష్యత్తులో ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎ.రాజు, ఇ.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించాలి



కె.కోటపాడులో హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డిసెంబర్ 7న మెగా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని ఎంఈవో డి.వి.డి. ప్రసాద్ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించే ఈ సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలను ఆహ్వానించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు ముందుకు వచ్చే దాతలు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు ఉంటే ఈ సమావేశాల్లో వారి చేపట్టబోయే కార్యక్రమాలను ప్రకటించాలని ఆయన తెలిపారు.

ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ఎ.కోడూరులో వైద్య పరీక్షలను చేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు తెలిపారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఎ.కోడూరు హైస్కూల్లో 42 మంది విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ వైద్య సేవలను అందించి, అనారోగ్య సమస్యలున్న వారికి మందులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్ హెచ్‌పీశాంతి, ఏఎన్‌ఎంలు సంతోషి, ముత్యవమ్మ, కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎస్ రోడ్డులో ప్రయాణం బిక్కుబిక్కు



వడ్డాదిలో పెద్దేరు నదిపై శిథిలమై కుంగిపోయిన వంతెన



పొట్టిదొరపాలెం కల్వర్టు వద్ద వాహనదార్లు అవస్థలు



కొమళ్లపూడి వద్ద కూలిన కల్వర్టు గోతిలో వేసిన రాళ్లు

- పాక్షికంగా కూలిన వంతెనలు, కల్వర్టులు
- కూలేందుకు సిద్ధంగా మరికొన్ని..
- కొద్దిపాటి వర్షానికే మునుగుతున్న డైవర్షన్ రోడ్లు
- అవస్థలు పడుతున్న మూడు జిల్లాల వాహనదారులు
- పట్టించుకోని పాలకులు

భీమునిపట్నం,నర్సీపట్నం(బీఎస్) రోడ్డులో ప్రయాణం రోజురోజుకూ మరింత ప్రమాదభరితంగా మారుతోంది. ఈ రహదారిలో పలు వంతెనలు, కల్వర్టులు, మదుములు శిథిలావస్థకు చేరాయి. కొన్ని పాక్షికంగా కూలిపోగా, మరికొన్ని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. చోడవరం నియోజకవర్గం పరిధిలోని ఈ రోడ్డులో ఆరు వంతెనలకు గాను రెండు కూలిపోయాయి, ఒక వంతెన శిథిలావస్థకు చేరింది. సుమారు 15 కల్వర్టులు, మదుములు శిథిలావస్థలో ఉన్నాయి. పది కల్వర్టులు పాక్షికంగా కూలిపోవడంతో వాహనచోదకులు భయంగా భయంగా ప్రయాణిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు, వంతెనల నిర్మాణానికి రూ.78 కోట్లు మంజూరైనా కాంట్రాక్ట్ పొందిన వ్యక్తి టీడీపీ నాయకుడు కావడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు రావాలని నిర్మాణం చేపట్టడంలో తీవ్ర జాప్యం చేశాడు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఐదు నెలలైనా ఈ రోడ్డు గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం నుంచి నర్సీపట్నం వరకు ఉన్న రోడ్డు అభివృద్ధి విషయంలో పాలకులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా చోడవరం నియోజకవర్గంలోని రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాల పరిధిలో సుమారు 45 కిలోమీటర్ల పొడవున రోడ్డుతో పాటు పలు వంతెనలు, కల్వర్టులు,మదుములు శిథిలావస్థకు చేరాయి. పలు గ్రామాల వద్ద వంతెనలు,కల్వర్టులు, మదుములు కూలిపోయాయి. ఇప్పటికే ప్రధానమైన బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో పెద్దేరు వంతెన పాక్షికంగా, విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన పూర్తిగా కూలిపోగా, చోడవరం మండలంలో గోవాడ వంతెన కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. నాలుగు మండలాల్లో పరిధిలో సుమారు 25కి పైగా మదుములు,కల్వర్టులు శిథావస్థలకు చేరాయి. వీటిలో 10 పాక్షికంగా కూలిపోయాయి. వంతెనలు,కల్వర్టులు,మదుములు కూలుతున్నా పాలకులు,అధికార్లు పట్టించుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిదేళ్ల కిందట అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీ మంత్రిగా పని చేసిన చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే రాజు .. బీఎస్ రోడ్డుకి నిధులు మంజూరయ్యాయి, పనులు ప్రారంభిస్తామని పలుమార్లు ప్రకటనలు చేసినా, వారి ప్రకటనలు నీటిమీద రాతల్లాగే మిగిలిపోయాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో బీఎస్ రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.110 కోట్లు నిధులు మంజూరుకు ప్రణాళికలు తయారు చేయించి పంపించారు. ముందుగా సుమారు రూ. 78 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టే కాంట్రాక్టర్ టీడీపీ నాయకుడు(ప్రస్తుత కల్యాణదుర్గం ఎమ్మెల్యే) కావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా పనులు నగంసగం చేపట్టి వదిలేశారు. కల్వర్టులు,మదుంలు, వంతెనలు రోడ్డు పనులు చేయాలని ప్రజలు రోడ్కెక్కి ధర్నాలు చేయగా యంత్రాలు తెచ్చి వారం,పది రోజులు పాటు పనులు తూతూ మంత్రంగా చేసి మధ్యలో వదిలేశారు. వర్షాకాలంలో నదులు ఉధృతంగా ప్రవహించి వడ్డాదిలో పెద్దేరు,విజయరామరాజుపేటలో తాచేరు నదిపై ఉన్న డైవర్షన్ రోడ్లపై నుంచి వరద నీరు ప్రవహించడంతో విశాఖపట్నం,పాడేరు,అనకాపల్లి,కాకినాడ,రాజమండ్రి,నర్సీపట్నం,చోడవరం,మాడుగుల తదితర ప్రాంతాలకు తిరిగే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు నిలిచిపోతున్నాయి. మూడు జిల్లాల ప్రయాణికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వేలాది మంది వాహనదార్లు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ముందుగా బీఎస్ రోడ్డును బాగు చేస్తామన్న ఎంపీ సీఎం రమేష్,ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు ఇచ్చిన హామీ ఇంతవరకు నెరవేరలేదు. తక్షణం బీఎస్ రోడ్డులో శిథిల వంతెనలు, మదుంల స్థానంలో కొత్త వాటి నిర్మాణం చేపట్టి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని విశాఖ ఉమ్మడి జిల్లాల ప్రజలు కోరుతున్నారు.



విజయరామరాజుపేటలో కూలిన తాచేరు వంతెన



బీఎస్ రోడ్డులో గొయ్యి వద్ద హెచ్చరికగా ఏర్పాటు చేసిన ఎర్రవస్త్రం

ఘనంగా మాస శివరాత్రి వేడుకలు



తిమిరాం శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం ఉమామహేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని మాస శివరాత్రి వేడుకలను శుక్రవారం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆలయ అర్చకులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, గోమాతకు పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు. గోమాతను మేళ తాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాల భక్తి గీతాలాపనలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుంది.

పశుగణనకు సహకరించాలి



కేజే పురం జంక్షన్‌లో పశుగణనను పరిశీలిస్తున్న నరసింహులు

మాడుగుల రూరల్: గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుగణనతో రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని పాడేరు డివిజన్ పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు సీహెచ్ నరసింహులు తెలిపారు. మండలంలో కేజే పురం జంక్షన్‌లో జరుగుతున్న పశుగణన సర్వేను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పశుగణన జరుగుతుందని, రైతులు తమ పశుసంపద వివరాలను సిబ్బందికి అందించి సహకరించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 4,905 ఇళ్లను సర్వే చేసినట్టు చెప్పారు. పశుగణనపై ఆధారపడి రానున్న రోజుల్లో పశువులకు ఉచిత టీకాలు, మందులు అందించనున్నట్టు తెలిపారు. ఈ సర్వేలో కేజే పురం పశువైద్య సహాయకులు రమేశ్ తదితర్లు పాల్గొన్నారు.

అన్నదాతలకు ‘ఫెంగల్’ బెంగ

- కోతల వేళ మారిన వాతావరణం
- తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన



కె.కోటపాడులో వరి పంటను ఎడ్లబండిపై తరలిస్తున్న రైతులు



ఎరుకువాడలో నేల కొరిగిన వరి పంట



కందిపూడిలో వరి పనలు తడి ఆరకుండానే మెషిన్‌తో నూర్చుతున్న రైతులు

కె.కోటపాడు : వాతావరణంలో మార్పులు అన్నదాతలను భయపెడుతున్నాయి. కోతదశకు వచ్చిన పంట చేతికందకుండా పోతుందేమోనన్న గుబులు వారిని వెంటాడుతోంది. ఫెంగల్ తుపాను హెచ్చరికలతో పంటను రక్షించుకునేందుకు పరుగులు తీస్తున్నారు. పలు పల్లపు ప్రాంత గ్రామాలైన రొంగలినాయుడుపాలెం, గొండుపాలెం, మల్లంపాలెం, మేడిచర్ల, ఎ.భీమవరం, పాడుగుపాలెం, గుల్లేపల్లి, వి.సంతపాలెం, కె.కోటపాడుతో పాటు పలు గ్రామాల్లో కోతలు కోసి మడుల్లో పంటను ఆరబెట్టారు. తుపాను హెచ్చరికలతో పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది.

రోలుగుంట: తుపాను హెచ్చరికలతో మండల రైతులు పంట సంరక్షణకు చర్యలు చేపట్టారు. కోసిన పంటను మోపులు కట్టి సురక్షిత ప్రాంతాలకు తరలించి, కుప్పలు పెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. గురు, శుక్రవారాల్లో కోతలు జరపలేదు.

మాడుగుల రూరల్/మాడుగుల: మండలంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చిరుజల్లులు పడ్డాయి. దీంతో భయాందోళనకు గురైన రైతులు కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో పడ్డారు. మండలంలో 90 శాతం వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. ఈదురు గాలులు వల్ల కొన్ని చోట్ల వరి పంట నేల కొరిగింది.మరో పక్క రెల్ల రాల్చే పురుగు కారణంగా వరి పంట దెబ్బతింది.

బుచ్చెయ్యపేట: వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశకు చేరిన వరి చేను నేలవాలిపోకుండా చర్యలు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో నూర్పుడు యంత్రాలతో నూర్పి ధాన్యం గింజలను ఇంటి తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా వరి పంటను కోయవద్దని, కోసిన పంటను చిన్నచిన్న కుప్పలుగా పెట్టి భద్ర పరుచుకోవాలని కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజ్‌కుమార్,మండల వ్యవసాయాధికారి భాస్కరరావులు రైతులకు సూచించారు.


సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న న్యాయవాది ప్రసాదరావు

మాడుగుల రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని న్యాయవాది శ్రీనాథు ప్రసాదరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ సెక్యూరిటీ అన్న అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ సీ.వి.ఎస్.ఎస్.శాస్త్రి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఆర్థిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక ఇండియన్ బ్యాంకు మేనేజర్ సత్య వినయ్ మాట్లాడుతూ బ్యాంకు పేరిట జరిగే మోసాలను వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థి, న్యాయవాది జె.జగదీశ్, సచివాలయ మహిళా పోలీసు కల్యాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి తదతరులు పలు అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు డాక్టర్ షర్మిలశ్రీ, ఆర్.వి. రమణమూర్తి, అప్పలనాయుడు, రాజు, నారాయణ, ప్రసాదరావు, నాగేశ్వరావు, ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ అధికారి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల నిరసన



ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెంట్లు

చోడవరం రూరల్: భారత జీవితభీమా సంస్థ ఏజెంట్లు, పాలసీదారుల పట్ల చూపుతున్న వివక్షను నిరసిస్తూ శుక్రవారం స్థానిక ఎల్‌ఐసీ బ్రాంచి కార్యాలయం ఎదుట ఏజెంట్లు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏజెంట్ల అసోసియేషన్ విశాఖపట్నం డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు మాట్లాడుతూ క్లా బ్యాక్‌అప్ కమిషన్ నిబంధన, పాలసీదారుల నుంచి వసూలు చేస్తున్న జీఎస్టీ తొలగించాలని, చిన్న ఏజెంట్లకు సైతం రెండు లక్షల రూపాయల మేరకు మెడీక్లయిమ్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రూప్ ఇన్సూరెన్సును 85 ఏళ్ల వయసు వరకు వర్తించేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు వచ్చే నెల 9న విశాఖపట్నం డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ చోడవరం బ్రాంచి అధ్యక్షుడు ఎస్.మోహన్‌రావు, కోశాధికారి టి.నూకరాజు, ఎస్.అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బెన్నవోలులో ముమ్మరంగా పారిశుధ్యపనులు



మురుగును తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

చోడవరం రూరల్: బెన్నవోలులో పారిశుధ్య పనులను శుక్రవారం నిర్వహించారు.ఈ పనులను సర్పంచ్ మూడెడ్ల శంకరరావు పర్యవేక్షించారు. గ్రామంలోని పలు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తీయించి వర్షపునీరు, వాడుక నీరు నిల్వ ఉండకుండా వెళ్లేరీతిలో శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్య చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ తెలిపారు.

వచ్చే నెల 15 నాటికి అభివృద్ధి పనులు పూర్తి



గొండుపాలెంలో డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల ఇంజనీర్ సుమతి

కె.కోటపాడు : మండలంలో రూ.6.29 కోట్ల ఉపాధి నిధులతో చేపట్టిన 51 పనులను వచ్చేనెల 15 నాటికల్లా పూర్తి చేయనున్నట్టు మండల ఇంజినీర్ పి.సుమతి తెలిపారు. గొండుపాలెంలో జరుగుతున్న డ్రైనేజీ పనులతో పాటు చౌడువాడలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. 51 పనుల్లో ఇప్పటికే 27 పనులు పూర్తి కాగా మరో 24 పనులు జరుగుతున్నట్లు ఆమె చెప్పారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి రూ.1.12 కోట్ల బిల్లుల చెల్లించినట్టు తెలిపారు. మండలంలో జరుగుతున్న పనులు డిసెంబర్ 15 నాటికల్లా పూర్తి అయ్యేలా చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులను నిర్మాణదారులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొండుపాలెం సర్పంచ్ బండారు కనక మల్లీశ్వరి, బండారు లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ వంటాకు శ్రీనివాసరావు, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరక్టర్ దొగ్గ ఉమాశంకర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ భవానీప్రసాద్

చోడవరం: విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మత్సా భవానీప్రసాద్ హెచ్చరించారు. రావికమతం మండలం చిలకవానిపాలెం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తన సొంత సొమ్ముతో పుస్తకాలు అందజేశారు. అనంతరం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలన్నారు. విద్యార్థులకు అవసరమైన బోధన సామగ్రిని అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బుది రెడ్ల రాము పాల్గొన్నారు.

రూ.8 లక్షతో అభివృద్ధి పనులు



టైల్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న కోఆప్షన్ సభ్యురాలు ఉన్నీషా బేగం

మాడుగుల: మండల కేంద్రం మాడుగులలో రూ.8 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు కోఆప్షన్ సభ్యురాలు ఉన్నీషాబేగం చెప్పారు. స్థానిక షాదీఖానా అభివృద్ధికి రూ.6.50 లక్షలు, 8వ వార్డులో ఉన్న అతి పురాతన దేవతా చెట్టు చుట్టూ టైల్స్ ఏర్పాటుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. స్థానిక దుర్గాలమ్మఆలయం ఎదుట ఉన్న దేవతా చెట్టుచుట్టూ టైల్స్ ఏర్పాటుకు శుక్రవారం శంకుస్థాపన చేశారు.

పశుగణనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



జైతవరంలో పశుగణనను పరిశీలిస్తున్న చిట్టినాయుడు

చీడికాడ: ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న 21వ పశుగణన విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మాడుగుల పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు అన్నారు. మండలంలోని జైతవరంలో జరుగుతున్న ఇంటింట పశుగణన కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 3,073 ఇళ్లను సర్వే చేసినట్టు చెప్పారు.

390 మట్టి లింగాలకు ప్రత్యేక పూజలు



మట్టి లింగాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

చోడవరం: జుత్తాడ గ్రామంలో స్పటిక లింగేశ్వరస్వామివారి ఆలయంలో మట్టితో తయారు చేసిన శివలింగాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో భక్తులంతా కలిసి మట్టితో 390 శివలింగాలను తయారు చేశారు. వాటిని ఇక్కడి పురాతన స్పటిక లింగేశ్వర స్వామి ఆలయంలో లింగాకారంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రుద్రహోమం చేశారు. గ్రామస్తులంతా ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చీడికాడ: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో హేమసుందర్ తెలిపారు. వరాహపురం సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను విద్యార్థుల సద్వినియోగం చేసుకుని స్కూల్ సర్టిఫికెట్లలో ఉన్న తప్పులను సరిచేసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆలయాల వార్షికోత్సవం



శివలింగాలకు పూజ చేస్తున్న భక్తులు

రోలుగుంట: స్థానిక కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయ 23 వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దర్మకర్త పిల్లి చిన్నారావు కుటుంబ సభ్యులతో కలసి పూజలు చేశారు. వేద పండితులు కిరణ్ శర్మ, కౌశిక్, శేషుశర్మ, రవి కిరణ్ శర్మ, పోలా ప్రగడ శ్రీనివాసశర్మ పూజలు జరిపించారు. స్థానికులతో పాటు కొవ్వూరు, కె.నాయుడుపాలెం, కొండపాలెం, వెలంకాయలపాలెంగ్రామాలనుంచి వేకువజామున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

బుచ్చెయ్యపేట: పి.భీమవరంలో భీమలింగేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలతో పాటు రుద్రాభిషేకాలు,క్షీరాభిషేకం, హోమాలు జరిపారు.బంగారుమెట్ట,ఎల్‌బీ పురం,చిన అప్పనపాలెం,వడ్డాది,లోపూడి, శింగవరం, దిబ్బిడి,కేపీ అగ్రహారం,బుచ్చెయ్యపేట, కొండెంపూడి గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద భజనలు చేశారు.